# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### కాంగ్రెస్‌ను నమ్మితే వలస బతుకే..



బాన్సువాడ టౌన్, నవంబర్ 23: కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెల్వక రాత్రింబవళ్లు కరెంటు కోసం ఎదురుచూస్తూ పొలంలోనే ఉండేవాళ్లం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారు. ఇప్పుడు అవసరం ఉన్నప్పుడు మోటరు చాలుచేసి హాయిగా నీళ్లు పారిస్తున్నాం. రైతుల కరెంటు కష్టాల గురించి ఎలాంటి అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడి రైతులను అవహేళన చేయడం సరికాదు. కాంగ్రెసోళ్లు ఓటు అడగానికి ఏ రైతు ఇంటికి వెళ్లినా వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతదా అన్న మాటకు సమాధానం చెప్పాలి. వాళ్ల ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంటు కష్టాలు, వాళ్లు రైతులకు చేసిన అన్యాయం అందరికీ తెలిసిందే. మళ్లీ వాళ్లకు అధికారం ఇచ్చే ధైర్యం చేయలేం.

**- భీంరెడ్డి, రైతు, బాన్సువాడ**

### 10హెచ్‌పీ మోటరు కొనలేం..



కాంగ్రెసోళ్లు రైతులను ఆగం చేయాలని చూస్తున్నారు. వ్యవసాయానికి 3గంటల కరెంటు ఇస్తే పంటలకు నీరు అందక ఎండిపోతాయ్. తెలంగాణ రాక ముందు కాంగ్రెసోళ్లు ఇట్లనే చేసిండ్రు. అర్ధరాత్రి కరెంటు ఇస్తే అదే రాత్రి పొలానికి వెళ్లి బోర్లు చాలు పెట్టేవాళ్లం. అది కూడా గంట, రెండు గంటలు ఇస్తే మస్తు అయితుండె. ఇప్పుడు మళ్లీ అదే రీతిలో మూడు గంటలు ఇస్తమని చెబుతుండ్రు. గదేదో 10హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని అంటుండ్రు. ఆ మోటరును మేం కొనలేం. అంత ఖర్చు పెట్టి కొన్న మోటరు కరాబైతే రిపేర్లు కాంగ్రెసోళ్లు వచ్చి చేయిస్తారా చెప్పాలి. చాలా ఏండ్లు కాంగ్రెసోళ్ల పాలనలో మేం పడ్డ తిప్పలు సాలు. కాంగ్రెస్‌కు ఓటు వెయ్యం. వేసి కష్టాలను కొనితెచ్చుకోం. రైతులను రాజుగా చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు అండగా నిలబడి మరోసారి అధికారం ఇస్తాం.

**- గైని మోహన్, రైతు, బాన్సువాడ**



### ఓట్ల కోసం కాంగ్రెస్ నాటకమాడుతున్నది..



సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల కరెంటుతో సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. కాంగ్రెస్ పార్టీ మళ్లీ వస్తే కరెంటు కష్టాలు తప్పవు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు నారు పోసినప్పటి నుంచి పంట అమ్మి పైసలు చేతికొచ్చే వరకు అన్ని ఏర్పాట్లు, సౌలత్‌లను ప్రభుత్వం కల్పిస్తుంది. మా పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల రైతులు అనుభవిస్తున్న కష్టాలను కండ్లతోటి చూస్తున్నాం. సచ్చినా కాంగ్రెస్‌కు ఓటు వేయం. తప్పుడు మాటలు మాట్లాడి, వాగ్ధానాలు చేసి రైతన్నలను మోసం చేస్తే ఊరుకునేదే లేదు. రైతు సంతోషంగా ఉండాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం రావాల్సిందే.

**- తాటి పెంటయ్య, రైతు, బాన్సువాడ**

# కాంగ్రెస్‌ను నమ్మితే.. చిప్ప 'చేతి'కే..

**మూడు గంటల కరెంటుతో పొలాలు ఎండుడే..**

- పంట పండదు..పెట్టుబడీ రాదని రైతుల ఆవేదన
- అప్పులబాధతో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యే ప్రమాదం
- 10 హెచ్‌పీ మోటర్లు నడ్వవు..
- అదనపు ఖర్చులు పెట్టించాలని చూస్తున్న కాంగ్రెసోళ్లు..
- సీఎం కేసీఆర్ ఇచ్చే 24గంటల కరెంటే చాలు..
- మార్పులు వద్దు.. కాంగ్రెస్‌ను రానివ్వొద్దని స్పష్టం చేస్తున్న రైతాంగం

### కేసీఆర్‌తోనే కరెంటు బాధలు తీరాయి..



తాడ్వాయి, నవంబర్ 23: సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే వ్యవసాయానికి కరెంటు కష్టాలు పూర్తిగా తీరాయి. కాంగ్రెసోళ్ల పాలనలో కరెంటు కష్టాలతో వ్యవసాయం వదిలి వలస పోయిన వాళ్లు ఉన్నారు. అప్పుడు రాత్రుళ్లు కరెంటు ఇవ్వడంతో పొలాల దగ్గరే జాగారం చేసేవాళ్లం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత 24గంటలు ఏ ఇబ్బందీ లేకుండా కరెంటు వస్తున్నది. ఇప్పుడే చాలా బాగున్నది. రైతులకు ప్రధానంగా ఉండాల్సింది 24 గంటల కరెంటు. లేకపోతే మళ్లీ వ్యవసాయం కష్టమవుతుంది. కాంగ్రెస్ మాయమాటలు నమ్మం. 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్‌కే మా మద్దతు.

**- ఉప్పు స్వామి, రైతు, తాడ్వాయి.**

### మూడు గంటల కరెంటొద్దు..



ఎవుసానికి మూడు గంటల కరెంటు ఇస్తే మళ్లీ పాత కాలం నాటి బాధలే వస్తాయి. అసలు ఎవుసానికి మూడు గంటల కరెంటు సరిపోదు. పొలం పనిచేయనోడికి ఏం తెలుసు మా బాధలు. సీఎం కేసీఆర్ పొలం పనిచేసినోడు కాబట్టే మా రైతుల బాధల్ని అర్థం చేసుకొని 24 గంటల కరెంటు ఇస్తుండు. రెండు పంటలు పండేలా అన్నివిధాలా సాయపడుతున్నడు. మమ్మల్ని సంతోషంగా ఉంచేందుకు కృషి చేస్తున్నాడు. కేసీఆర్ నేతృత్వంలో ఇప్పుడే ఉత్సాహంగా ఎవుసం చేసుకుంటున్నాం. కాంగ్రెసోళ్లు చెప్పే మాటల్ని రైతులెవరూ నమ్మొద్దు. 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ పార్టీనే గెలిపించుకోవాలి.

**- సాకలి చంద్రయ్య,బ్రాహ్మణపల్లి,మండలం తాడ్వాయి**

### మూడు గంటల కరెంటుతో పంటలు ఎండుడే..



వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే వేసిన పంటలు ఎండుతాయి. పంటలు పండించలేక నష్టపోతాం. అప్పులబారిన పడడం ఖాయం. ఏసీ రూముల్లో కూసోని మస్తు మాట్లాడుతుండ్రు గీ కాంగ్రెసోళ్లు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం సాధ్యం కాదు. ఆ మోటర్ పెట్టుకుంటే ఒక్కసారిగా ఫుల్ నీళ్లు పోసి.. ఆ తర్వాత చుక్క నీరు కూడా రాదు. నీళ్లు రాకపోతే మోటరు కరాబైతది. రిపేర్లకు పైసలు పెట్టాల్సి వస్తది. ఇదంతా చేస్తే పంట పండదు.. పెట్టుబడి కూడా రాదు. రైతులను ముంచాలని చూస్తున్న కాంగ్రెసోళ్ల మాటలు నమ్మం. పంటలు పండేలా కరెంటు ఇస్తున్న కేసీఆర్‌నే మళ్లీ గెలిపిస్తం.

**-వెంకట్‌రావు, రైతు, బ్రాహ్మణపల్లి**

### రైతుల్ని ముంచాలని చూస్తుండ్రు..



వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలని రేవంత్‌రెడ్డి చెబుతుంటే నవ్వాలో ఏడ్వాలో తెలియడం లేదు. ధిమాక్ కరాబై మాట్లాడుతుండో, నెత్తిలేక మాట్లాడుతుండో అర్థం కావడం లేదు. మూడు గంటల కరెంటు ఇస్తే పంటలు సరిగ్గా పండక, పెట్టుబడి తిరిగి రాక రైతులు మళ్లీ అప్పులపాలై ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురిస్తుంది. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన విడుతల వారీ కరెంటు మూలంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇప్పుడు 24గంటల కరెంటు వస్తుండగా మళ్లీ రైతులను ముంచేందుకు మూడు గంటల కరెంటు చాలని చెబుతుండ్రు. మమ్మల్ని ముంచాలని చూస్తున్న కాంగ్రెస్‌ను ముంచేస్తం.

**- పైడాకుల గంగారెడ్డి, బ్రాహ్మణపల్లి.**

### కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తాం..



వ్యవసాయానికి 3గంటల కరెంట్ ఇస్తే రాత్రంతా పొలం వద్దే ఉండే పరిస్థితి వస్తుంది. మూడు గంటల కరెంటు ఎట్ల సరిపోతుంది. మూడు మడులు కూడా సరిగ్గా పారవు. రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండ్రు. ఇంక మీదికెల్లి 10హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని చెబుతుండ్రు. ఆ మోటర్లు పెడితే స్టాటర్లు ఉంటయా? ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవా. రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెసోళ్లకు బుద్ధి చెప్తాం.

**- ఏ.శివాజీరావు, రైతు, తాడ్వాయి**

